నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, సోమవారం 8 జనవరి 2024 | NIZAMABAD

● కన్నుల పండువగా...



**ఆలూర్‌లో** వీడీసీ ఆధ్వర్యంలో కండేరాయుడు మల్లన్న జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి మల్లన్న స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయం చుట్టూ రథం ప్రదక్షిణ కన్నుల పండువగా సాగింది. – ఆర్మూర్‌టౌన్, జనవరి 7



పాదుకలతో పాదయాత్రగా బయల్దేరిన స్వాములు

## అయోధ్య నుంచి పాదుకలతో పాదయాత్ర

శక్కర్‌నగర్, జనవరి 7: అయోధ్య భవ్య శ్రీరామ మందిరం ప్రారంభోత్సవం, స్వామివారి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా తెలంగాణలో విశిష్ఠత కార్యక్రమం నిర్వహణకు ఏర్పాటుకు చిలుకూరు శివాలయం ప్రధాన అర్చకుడు శ్రీ రామదాసి సురేశ్ ఆత్మారాం మహరాజ్ సంకల్పించారు. ఇందులో భాగంగా ఆయన హైదరాబాద్‌లో తయారు చేయించిన పాదుకలను తీసుకొని మరో 20 మంది శిష్య బృందంతో ఈనెల 6న అయోధ్యకు చేరుకున్నారు. ఈ పాదుకలకు ఆదివారం అయోధ్యలోని భరత్‌కుండ్ సరోవరం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం వాటిని తీసుకొని తెలంగాణకు పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అయోధ్య నుంచి 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ తాను శిష్యబృందంతో కాలినడకన, పాదుకలు తెస్తున్నట్లు తెలిపారు. అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం తేదీ ఈనెల 22 నాటికి వీటిని ఇటీవల తాను ప్రారంభించిన 'కొండగట్టు' గిరి ప్రదక్షిణ రహదారిలో ఓ పాదుకల జతను, బోధన్ శివారులోని నర్సాపూర్ దివ్యసంజీవనీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద మరో జత ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ పాదయాత్ర నిరంతరంగా సాగుతోందని, 22 నాటికి ఆయా స్థలాలకు చేరకుంటామని తెలిపారు. అయోధ్య రామమందిర నిర్మాణ విశిష్టతను తెలుపుతూ.. తెలంగాణ ప్రాంతంలో గుర్తుగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వేదికపై జడ్పీచైర్‌పర్సన్ శోభ, మాజీ విప్ గంప గోవర్ధన్, ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాసరెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు హన్మంత్ షిండే, జాజాల సురేందర్

# హ్యాట్రిక్ సాధించేలా..!

### కలిసికట్టుగా పనిచేయాలని శ్రేణులకు కేటీఆర్ పిలుపు

జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నేతలతో సమీక్ష
హాజరైన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన గులాబీ నేతలు
అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపైనా సమీక్ష జరిపిన ముఖ్య నాయకులు

నిజామాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : లోక్‌సభ ఎన్నికల్లో విజయమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ పార్టీ సన్నాహక సమావేశాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నేతృత్వంలో సమీక్ష జరిగింది. ఈ మీటింగ్‌కు కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్, నారాయణ్‌ఖేడ్, ఆంధోల్, జహీరాబాద్ నియోజకవర్గాలకు చెందిన నేతలంతా హాజరయ్యారు. ఇందులో కూలంకషంగా చర్చ జరిగిందని నేతలు పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఎదురైన అనుభవాలను ముఖ్య నేతలంతా కేటీఆర్ ముందు ప్రస్తావించినట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప ఓట్ల మెజార్టీతోనే ప్రభుత్వ ఏర్పాటు విషయంలో బీఆర్‌ఎస్ అవకాశం కోల్పోయిందని నేతలు అభిప్రాయపడ్డారు. గెలుపోటములు ఏ రకంగా ఉన్నప్పటికీ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం గులాబీ పార్టీకే విజయావకాశాలున్నట్లు కేటీఆర్ తన ప్రసంగంలో చెప్పినట్లుగా నేతలు తెలిపారు. కొద్ది రోజుల్లోనే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉన్నందున ప్రజల్లోకి వెళ్లి క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం కావాలని తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలో హన్మంత్ షిండే ఓడిపోవడం తనను తీవ్రంగా కలిచి వేసిందని కేటీఆర్ ప్రస్తావించారు. నాయకులంతా కలిసి మెలిసి పని చేసి లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

### లోక్‌సభ ఎన్నికల్లో కష్టపడితే విజయం మనదే...



అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తన శక్తితో గెలవలేదని, బీఆర్‌ఎస్ బలహీనతలే కాంగ్రెస్ పార్టీ విజయానికి కారణమని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ భవన్‌లో జరిగిన జహీరాబాద్ పార్లమెంట్ సన్నాహక సమావేశంలో మాట్లాడారు. సంఖ్యాపరంగా కాంగ్రెస్ గెలువొచ్చు కానీ నైతికంగా బీఆర్‌ఎస్ గెలిచిందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీలో ఉంటూ కొందరు సొంత అభ్యర్థులనే ఓడించుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో ఎవరు సమర్థులు ఉన్నారని ప్రజలు ఓట్లు వేశారు? ఇదీ కార్యకర్తల తప్పు కాదని పోచారం చెప్పారు. నాయకులుగా మనమే బాధ్యత వహించాలన్నారు. నాయకులు నిత్యం ప్రజల్లోనే ఉండాలన్నారు. బీఆర్‌ఎస్‌కు ఉన్న కేడర్ ఇతర పార్టీకి లేదని స్పష్టం చేశారు. కేసీఆర్ సీఎం కానందుకు ప్రజలు బాధపడుతున్నారని, కష్టపడి పని చేస్తే బీఆర్‌ఎస్‌కు 16 పార్లమెంట్ సీట్లు రావడం కష్టమేమి కాదన్నారు. గ్రూపు తగాదాలను స్వస్తి పలికి సమష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఇచ్చిన తీర్పును అందరూ గౌరవించాలని, అదే విధంగా గెలిచిన పార్టీలు కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని.. అది వారి బాధ్యత అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి నెలరోజులు అయ్యిందని.. సమీక్షల పేరుతో పరిపాలన గాలికి వదిలేశారని అన్నారు. విలువైన సమయాన్ని ఢిల్లీ –హైదరాబాద్ మధ్య తిరగడానికి వెచ్చిస్తున్నారని విమర్శించారు. కొత్త పథకాలు దేవుడెరుగు.. అమలులో ఉన్న పథకాలను వదిలేస్తున్నారని తెలిపారు. నూతన ప్రభుత్వం ఏదైనా గత ప్రభుత్వాల పథకాలను గౌరవిస్తూ, అదనంగా కొత్త పథకాలను అమలు చేయాలని అన్నారు.

### కేసీఆర్‌పై అభిమానం చెక్కుచెదరలేదు...



**ప్రజల్లో కేసీఆర్‌పై అభిమానం** ఏ మాత్రం చెక్కు చెదరలేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లేసిన వాళ్లు కూడా కేసీఆర్ సీఎం కానందున బాధపడుతున్నారని చెప్పారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో జరిగిన జహీరాబాద్ పార్లమెంట్ సన్నాహక సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. 2014 ఎన్నికల్లో అనివార్యంగా ఒంటరిగా పోటీ చేశామని, అప్పుడు సంస్థాగతంగా పార్టీ గట్టిగా లేకపోయినా ప్రజలు దీవించారని గుర్తు చేశారు. ఈసారి 119 సీట్లలో 39 సీట్లు గెలిచామని ఇది చిన్న సంఖ్య ఏమీ కాదన్నారు. మూడింట ఒక వంతు సీట్లు గెలిచామన్నారు. జుక్కల్‌లో హన్మంత్ షిండే ఓడిపోతారని అస్సలు ఊహించలేదన్నారు. కేవలం 11వందల ఓట్లతో ఆయన ఓడిపోవడంపై ప్రత్యేకంగా కేటీఆర్ ప్రస్తావించారు. నారాయణ్‌ఖేడ్ నుంచి వచ్చిన కాంగ్రెస్ నేత జుక్కల్‌లో గెలిచారన్నారు. ఇలాంటి విచిత్రాలు ఈ ఎన్నికల్లో జరిగాయని వివరించారు. దళితబంధు పథకాన్ని నిజాంసాగర్ మండలం మొత్తం ఇచ్చినా మిగతా వర్గాలు బీఆర్‌ఎస్‌కు ఓట్లు వేయలేదని చెప్పారు. ఒకరికి సాయం అందితే మరొకరు ఈర్ష్య పడేలా సమాజం తయారైందన్నారు. తెలంగాణ కోసం కడుపు చించుకొని కొట్లాడేది బీఆర్‌ఎస్ మాత్రమేనని చెప్పారు. బీఆర్‌ఎస్ బలంగా లేకపోతే తెలంగాణ పదాన్ని మాయం చేసేందుకు పార్టీలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. నెల రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో అప్రతిష్ఠ మూటగట్టుకుందని విమర్శించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు అప్పుడే నిరసన సెగ మొదలైందని చెప్పారు. అప్పుల బూచీ చూపించి హామీల నుంచి తప్పించుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

**త్రిముఖ పోరు మనకే మేలు...**

పార్లమెంట్ ఎన్నికల్లో త్రిముఖ పోరు జరుగనున్నదని, ఈ మూడు ముక్కలాటలో మనకే పరిస్థితులు అనుకూలంగా ఉంటాయని కేటీఆర్ చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగ్‌లను మార్చి ఉంటే బాగుండేదనే అభిప్రాయం బలంగా ఉందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో అలాంటి పొరపాట్లు జరగనివ్వమని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక తిరోగమన చర్యలకు పాల్పడుతోందని చెప్పారు. బీఆర్‌ఎస్ సర్కారు తెచ్చిన పథకాలను రద్దు చేస్తున్నదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ సీటును బీఆర్‌ఎస్ కచ్చితంగా గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ అన్నప్పుడు ఎత్తుపల్లాలు తప్పవన్నారు. 2009లో 10 అసెంబ్లీ సీట్లే గెలిచామని, కేసీఆర్ దీక్షతో ఆరు నెలల్లోనే పరిస్థితి మారిందని గుర్తు చేశారు. 1985–89 మధ్య జరిగిన ఎన్నికల్లో ఎన్టీఆర్ ఎన్నో మంచి పథకాలు తెచ్చినా ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఓడిపోయారని తెలిపారు. మొన్న కాంగ్రెస్‌కు ఓటేసిన వాళ్లు పునరాలోచనలో పడ్డారని చెప్పారు. కాంగ్రెస్ 420 హామీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ఒత్తిడి పెంచుదామన్నారు.

● క్యాంప్ కార్యాలయం ప్రారంభం

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆదివారం ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

–కామారెడ్డి, జనవరి 7



## మాంజా తగిలి బైక్‌పై వెళ్తున్న ఇద్దరికి గాయాలు

భిక్కనూరు, జనవరి 7 : గాలిపటం మాంజా తగిలి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులకు గాయాలైన ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండల కేంద్రంలో శనివారం సాయంత్రం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన సాయి, అర్వింద్ ద్విచక్ర వాహనంపై భిక్కనూరు నుంచి రామాయాంపేట్‌కు బయల్దేరారు. వీరి వాహనం సిద్ధరామేశ్వర స్వామి ఆలయ కమాన్ వద్దకు చేరుకోగానే పిల్లలు ఎగురవేస్తున్న గాలిపటం మాంజా తగిలి ఇద్దరికి గాయాలయ్యాయి. అర్వింద్ చెవి తెగిపోయింది. సాయి ముఖం, మెడపై గాయాలయ్యాయి. ఇద్దరిని తక్షణమే చికిత్స నిమిత్తం కామారెడ్డి దవాఖానకు తరలించారు.

## పూలే అడుగుజాడల్లో నడవాలి

● రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి



జలాల్‌పూర్‌లో కాన్షీరాం, జ్యోతిబాపూలే విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి, దళితసేన జాతీయఅధ్యక్షుడు రాజు

నిజామాబాద్ రూరల్, జనవరి 7 : పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే అడుగు జాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నిజామాబాద్ మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో 11 ఏండ్ల క్రితం నెలకొల్పిన మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) వ్యవస్థాపకుడు కాన్షీరాం విగ్రహాన్ని దళితసేన జాతీయ అధ్యక్షుడు జేబీ రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ప్రపంచంలోనే అతిపెద్దదైన భారత రాజ్యాంగాన్ని నిర్మించి అందరి ఆదరాభిమానాలు పొందడం గర్వించదగిన విషయమని పేర్కొన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన మహానాయకులను ఆదర్శంగా తీసుకుని వారి అడుగు జాడల్లో ముందుకు నడుస్తూ సమాజాభివృద్ధి కోసం పాటుపడేందుకు కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యేగా గెలిపించిన తనను అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన హామీనిచ్చారు. దళితసేన జాతీయ అధ్యక్షులు జెబి.రాజు మాట్లాడుతూ దేశంలో ఉన్న 85 శాతం బహుజనులందరూ సంఘటితంగా ఏర్పడి రాజ్యాధికారం కోసం పోరాటం చేయడమే ఏకైక లక్ష్యంగా ముందుకు సాగిన బీఎస్పీ వ్యవస్థాకులు కాన్షీరాం బాటలో నడవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మాజీ సర్పంచ్, దళిత సంఘం నాయకుడు నీరడి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సభలో కాంగ్రెస్ నాయకులు గడీల రాములు, ముప్ప గంగారెడ్డి, శేఖర్‌గౌడ్, జ్యోతిబా పూలే, కాన్షీరాం విగ్రహాల కమిటీ అధ్యక్షులు పెద్ద పోశెట్టి, ప్రధాన కార్యదర్శి ఉమ్మెడ రాజేశ్వర్, సాయికుమార్, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర మట్కా నిర్వాహకుడి అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్, ఏసీపీలు రాజశేఖర్ రాజు, కిరణ్ కుమార్

● జిల్లా కేంద్రం అడ్డాగా జోరుగా సాగిన జూదం
● ఏజెంట్లకు కోట్లలో టోకరా వేసిన నిర్వాహకుడు

నిజామాబాద్ క్రైం, జనవరి7 : నిజామాబాద్ జిల్లా కేంద్రాన్ని అడ్డాగా చేసుకొని మట్కా(జూదం)ను జోరుగా సాగించి కోట్ల రూపాయల లావాదేవీలు సాగించిన నిర్వాహకుడిని ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేశారు. ఇంత కాలం పోలీసులకు ఏమాత్రం అనుమానం కలగకుండా మట్కా నిర్వాహకుడు తన అనుచరగణంతో తెలంగాణతో పాటు మహారాష్ట్ర ప్రాంతాల్లో జోరుగా మట్కా నిర్వహించాడు. అంతే కాకుండా ఎంతో మంది యువతకు డబ్బుల ఆశ చూపించి వారిని మట్కా రొంపిలోకి లాగడమే కాకుండా పలువురు ఏజెంట్ల నుంచి కోట్లాది రూపాయలు దండుకొని వారికి ఎగనామం సైతం పెట్టినట్లు పోలీసుల విచారణలో తేలింది. నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్, నిజామాబాద్ ఏసీపీలు రాజశేఖర్ రాజు, కిరణ్ కుమార్ ఆదివారం వివరాలను వెల్లడించారు. నిజామాబాద్ నగరానికి చెందిన మహ్మద్ జమీర్ మట్కా ఏజెంట్లు, అనుచరుల ద్వారా అమాయక ప్రజలను మట్కా వ్యసనంలోకి దింపి వారికి డబ్బుల ఆశ చూపించి కోట్ల రూపాయలకు ఎగనామం పెట్టినట్లు తెలిపారు. అంతే కాకుండా నిందితుడు మహారాష్ట్రలోని నాందేడ్, ధర్మాబాద్, బిలోలి, వర్ధ, అకోలా, అమరావతి తదితర అనేక ప్రాంతాల్లో మట్కా నిర్వాహకులతో సంబంధాలు పెట్టుకొని ప్రతి రోజు విజేతలుగా రాబోయే నంబర్లను తీసుకొని వాటిపై ఏజెంట్లు, బుకీల ద్వారా భారీ ఎత్తున బెట్టింగ్ పెట్టి కోట్ల రూపాయల లావాదేవీలు నిర్వహించినట్లు విచారణలో తేలిందన్నారు. జమీర్‌ను ఆదివారం అరెస్టు చేసి,రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. జమీర్ అనుచరుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు ప్రారంభించాయి. దీంతో పాటు జమీర్ కూడ బెట్టిన ఆస్తుల వివరాలు సైతం సేకరించడంలో పోలీసులు నిమగ్నమయ్యారు. జిల్లా ప్రజలు మట్కా ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని సీపీ కల్మేశ్వర్ సూచించారు. అంతర్రాష్ట్ర మట్కా నిర్వాహకుడిని అరెస్టు చేసిన టాస్క్‌ఫోర్స్, పోలీసు సిబ్బందిని సీపీ అభినందించి, వారికి రివార్డులు ప్రకటించారు.





క్రీడాజ్యోతితో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, కలెక్టర్ జితేశ్ వీపాటిల్, డీఈవో రాజు, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

# అట్టహాసంగా..

### కామారెడ్డిలో ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

● 29 రాష్ట్రాల నుంచి 450 మంది క్రీడాకారులు హాజరు..

కామారెడ్డి, జనవరి 7 : 67వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్– 2024 అండర్ 17 కబడ్డీ పోటీలు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం రాత్రి అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ భారతదేశ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలని.. గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు కామారెడ్డిలో మొట్టమొదటిసారిగా నిర్వహించినందుకు అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు పోటీలను విజయవంతం చేయాలన్నారు. క్రీడాకారులకు కావాల్సిన సౌకర్యాలను కల్పిస్తామన్నారు. క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ నెల 11వ తేదీ వరకు పోటీలు కొనసాగుతాయి. 29 రాష్ట్రాలకు చెందిన 450 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజు, జిల్లా యువజన క్రీడల అధికారి దామోదర్ రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాయబ్ రసూల్, ఎస్జీఎఫ్ కార్యదర్శి రాంరెడ్డి, దాతలు పైడి ఎల్లారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజా ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో కలిసి కబడ్డీ ఆడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి